

జిల్లాలోని ప్రధాన సమస్యలను కలెక్టర్ డీకే బాలాజీ.. సీఎం చంద్రబాబుకు సవివరంగా తెలియజేశారు. ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రతపై కలెక్టర్ చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు మన జిల్లాతో పాటు అన్ని జిల్లాలకు రూ.5 కోట్ల నిధులు విడుదల చేయడం విశేషం. ఇంకా జిల్లాలోని అనేక సమస్యలను కలెక్టర్ ప్రస్తావించగా, సీఎం సానుకూలంగా స్పందించి దిశానిర్దేశం చేశారు.

దిశానిర్దేశం

జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి సీఎం సుముఖత

ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రతకు ఓకే



సీఎం, డిప్యూటీ సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు సృజన, బాలాజీ

- అప్పటికప్పుడు రూ.5 కోట్లు విడుదల
- జిల్లాస్థాయిలో ఖాళీ పోస్టులకు సానుకూల స్పందన
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు
- కలెక్టర్ డీకే బాలాజీకి సీఎం చంద్రబాబు హామీలు

మచిలీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు వినియోగించే ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసేందుకు అవకాశం లేకుండాపోయిందని, వాటికి నిచ్చెనలు లేదా మెట్లు ఏర్పాటు చేసేందుకు నిధులు విడుదల చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అమరావతి సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ డీకే బాలాజీ పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు రూ.5 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

- జిల్లాస్థాయి అధికారుల పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కలెక్టర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై పూర్తి వివరాలతో అన్ని జిల్లాల కలెక్టర్లు నివేదిక పంపాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచించారు.
- జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 80, 90 శాతం పనులు పూర్తయినా వాటిని వాడుకలోకి తెచ్చేందుకు కొంతమేర నిధులు విడుదల చేయాల్సి ఉందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ వివరించారు. ఈ తరహా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని

- మిగతా 6లో

చివరి కష్టాలు

శివారు కాల్వలకు అందని సాగునీరు





బందరు మండలం పెదపట్నం కాల్వను బాగు చేసుకుంటున్న రైతులు (ఇన్‌సెట్‌లో) కంకిపాడు మండలం కోలవెన్నులో వరిపైరుకు బోరునీరు

అగస్టులోనూ ఎండలు మండిపోతున్నాయి. నాట్లు వేసిన పొలాలకు సాగునీరు అందక రైతులు కాల్వల వద్ద పడిగాపులు పడుతున్నారు. ప్రధాన కాల్వల్లో నీటిమట్టం పెరగకపోవడంతో పొలాల్లోకి సాగునీరు పారని పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు నీటి విడుదల తగ్గడంతో రైతులు బోరునీటినే తోడి పైరును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల జరిగిందని, రెండు, మూడు రోజుల్లో సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని, పరిస్థితి చక్కబడుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

పంట కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు

- బోరునీటి ద్వారా పంటలు తడుపుకొనే ప్రయత్నాలు
- పెదపట్నం కాల్వలో తూడు, నాచు తొలగించుకున్న రైతులు
- వేములమడలో సాగునీటి కోసం ఆందోళన
- రెండు, మూడు రోజులకు కానీ చక్కబడని పరిస్థితి
- సాగర్ నుంచి వచ్చే నీటిపైనే అన్నదాతల ఆశలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో దిగువకు 80 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఐదు రోజుల పాటు నాగార్జున సాగర్ నుంచి నీరు వస్తే పులిచింతల ప్రాజెక్టు నిండుతుందని నీటిపారుదల శాఖ అధికారుల అంచనా. వారం క్రితం వరకు పులిచింతల ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉండగా, సోమవారం నాటికి 5 నుంచి 6 టీఎంసీలకు చేరింది. ఈ నీటిని కృష్ణాడెల్టా సాగునీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు మంగళవారం నాటికి ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా కృష్ణాడెల్టాలోని అన్ని ప్రధాన కాల్వలకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. సోమవారం బ్యారేజీ నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వలకు విడుదల చేశారు. అయితే, రెండు, మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో సాగునీటి వినియోగం పెరిగింది. ఇలాంటి సమయంలో శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శివారులో సాగునీటి కష్టాలు

- బంటుమిల్లి కెనాల్ ద్వారా బంటుమిల్లి మండలంలోని కొర్లపాడు, అర్తమూరు, మణిమేశ్వరం, పెదపట్నం గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. కొర్లపాడు వద్ద బంటుమిల్లి కెనాల్ నుంచి బందరు మండలంలోని పెదపట్నం బ్రాంచ్ కాల్వ ప్రారంభమవుతుంది. కొర్లపాడు వద్ద ప్రధాన కాల్వలో నాలుగు అడుగుల నీటిమట్టం ఉంటేనే శివారు ప్రాంతంలోని పెదపట్నం గ్రామానికి సాగునీరు వస్తుంది. ఈ కాల్వలో మూడు అడుగుల నీటిమట్టం మాత్రమే ఉండటంతో కొర్లపాడు, అర్తమూరు, మణిమేశ్వరం గ్రామాలకు చెందిన రైతుల ఆయిల్ ఇంజన్ల ద్వారా వచ్చిన నీటిని

- మిగతా 6లో

గన్నవరం తహసీల్దార్‌పై

బదిలీ వేటు

సీసీఎల్ఏ ఆదేశాలతో కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు

- తూర్పుగోదావరికి రిలీవ్ చేస్తూ నిర్ణయం
- శివయ్యకు గన్నవరం తహసీల్దార్‌గా పోస్టింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం/గన్నవరం) : వివాదాస్పద గన్నవరం తహసీల్దార్ పవన్‌కుమార్‌పై ఎట్టకేలకు బదిలీ వేటు వేశారు. ఆయన్ను తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఆదేశాలు జారీ చేశారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన వ్యక్తిని ఎందుకు కొనసాగిస్తున్నారని, తహసీల్దార్‌గా అతనికి పొడిగించిన గడువు కూడా ముగిసిందని, తక్షణం సీసీఎల్ఏకు రిపోర్టు చేయాలని కలెక్టర్‌ను సీసీఎల్ఏ ఆదేశించింది. దీంతో పవన్‌కుమార్‌ను తూర్పుగోదావరి జిల్లాకు రిలీవ్ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఆదేశాలిచ్చారు. తొలుత గన్నవరం డీటీ అరుణ్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించినా, ఆ వెంటనే సివిల్ సప్లయిస్‌లో పనిచేస్తున్న కె.వెంకటశివయ్యను గన్నవరం తహసీల్దార్‌గా నియమించారు. శివయ్య ఉమ్మడి కృష్ణాజిల్లాలో పనిచేశారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లో ఎస్టేట్ ఆఫీసర్ (ఈవో)గా విధులు నిర్వహించారు. మైలవరం తదితర మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు.

ఆది నుంచీ వివాదాస్పదుడే..

ఎన్నికల ముందు గన్నవరం తహసీల్దార్‌గా వచ్చిన పవన్‌కుమార్ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడి నుంచి వెళ్లడానికి ఇష్టపడలేదు. ఇతర జిల్లాల నుంచి కృష్ణాజిల్లాకు వచ్చిన తహసీల్దార్లంతా తమ సొంత జిల్లాలకు వెళ్లిపోయినా, పవన్‌కుమార్ కదల్లేదు. పవన్‌కుమార్ సీసీఎల్ఏ నుంచి వచ్చారు. అక్కడి నుంచి వచ్చినవారు బయట రెండేళ్లు మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లాలో తహసీల్దార్‌గా పవన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. సీతానగరం తహసీల్దార్‌గా ఏడాది పనిచేశారు. ఆ తర్వాత రాజానగరం వెళ్లారు. రాజానగరంలో చేస్తుండగానే, ఆయన రెండేళ్ల గడువు అయిపోయింది. అయితే, మరో ఏడాది పొడిగించాల్సిందిగా వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీఎల్ఏను కోరారు. అక్కడ ఓ కళాశాల వ్యవహారంలో ఆయన పాత్ర వివాదాస్పదమైంది. తర్వాత ఎన్నికల నేపథ్యంలో కృష్ణాజిల్లాకు రావటంతో గన్నవరంలో ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. అదనంగా మరో ఏడాది పెంచిన గడువు కూడా అయిపోయింది. గడువు ముగిసినందున రిపోర్టు చేయాల్సిందిగా సీసీఎల్ఏ ఆదేశించినా ఆయన కదల్లేదు. గన్నవరంలోని వీరపనేనిగూడెం భూములు, విజయవాడ ఎయిర్‌పోర్టు భూసేకరణలో పోయిన వెంచర్ల భూములకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేతో చర్చించకుండా ఆయన సొంత నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఈ నిర్ణయాలు ఉన్నాయి. తనకు నమ్మకంగా ఉండే ఒక అధికారితో కలిసి ఆయన ఈ ప్రయత్నాలు చేశారు. ఈ వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి' పలు అంశాలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో పవన్‌కుమార్‌పై బదిలీ వేటు వేశారు.

అర్ధరాత్రి హైడ్రామా

- పెడనలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో ఉద్రిక్తత
- అర్ధరాత్రి పిల్లర్ల నిర్మాణం.. పోలీసుల మోహరింపు
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

6లో..



ఎండిన వరి నారుతో రాస్తారోకో చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

▸ వేములమడలో రాస్తారోకో

కూచిపూడి, ఆగస్టు 5 : నారుమడులు ఎండుతున్నాయి.. నాట్లు వేసిన పొలాలు బీటలు వారాయి.. ఎన్ని పర్యాయాలు అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించకపోవడంతో ఎండిన వరి నారుతో రైతులు రోడ్డెక్కారు.. గంటల తరబడి రాస్తారోకో చేసి ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మొవ్వ మండలం వేములమడ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఎట్టకేలకు అధికారులు దిగివచ్చి రైతులతో చర్చించారు. జిల్లా కౌలురైతు సంఘ కార్యదర్శి, సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు, శీలం నారాయణరావులు రాస్తారోకో చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. తహసీల్దార్ కె.మస్తానరావు, వీరంకి సెక్షన్ ఇరిగేషన్ శాఖ ఏఈ కె.సత్యనారాయణ రైతులతో చర్చించారు. భీమనదిపై గల రెగ్యులేటర్‌కు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టి రైతులను ఆదుకుంటామని హామీ ఇవ్వటంతో సమస్య పరిష్కారమైంది. కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు చేపట్టారు.

దాడి ఘటనపై విచారణకు సిద్ధమా!



▸ ఉదయభానుకు తాతయ్య సవాల్

జగ్గయ్యపేట, ఆగస్టు 5 : నవాబుపేట వైసీపీ నేత దాడి ఘటనపై సీబీసీఐడీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా అని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు సవాల్ విసిరారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తాతయ్య మాట్లాడుతూ, చిట్యేలలో సీతారెడ్డి, మల్లారెడ్డి, ముండ్లపాడులో నరసరావుల హత్యలపై సీబీసీఐడీ విచారణకు సిద్ధమేనా, నవాబుపేటలో జరిగిన గింజుపల్లి వీరయ్య, బుచ్చయ్య చౌదరిల హత్యలపై తాము సీబీఐ విచారణకు సిద్ధమని చెప్పారు. హింస, హత్యా రాజకీయాలను తాము గాని, పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఏనాడు ప్రోత్సహించ లేదని తెలిపారు. రాజకీయాల కోసం ఏ రోజు దిగజారలేదని స్పష్టం చేశారు.

పుస్తకం ఇవ్వకపోతే ప్రాణత్యాగం

▸ నా భూమికి పట్టా కోసం మామ్మూళ్లు అడుగుతున్నారు

▸ కలెక్టరేట్ వద్ద బాధితురాలి ఆవేదన



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : నా భూమికి పాసుపుస్తకం ఇవ్వకపోతే ప్రాణత్యాగం చేస్తానని పెదపారుపూడి గ్రామానికి చెందిన బాధితురాలు గంటా సుశీల ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ, నా భూమి పాసు పుస్తకం ఇచ్చేందుకు పెదపారుపూడి రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారని, వైసీపీ నేతల మాటలు విని తనకు పుస్తకం ఇచ్చేందుకు వెనుకాడుతున్నారని ఆరోపించింది. కొందరు రెవెన్యూ అధికారులు మామ్మూళ్లు అడుగుతున్నారని ఆరోపిస్తూ.. కౌలుదారు బండి విజయకుమారికి పట్టా ఇచ్చేందుకు అధికారులు చూస్తున్నారని చెప్పింది. తనకున్న 48 సెంట్ల పొలాన్ని దున్నుకోకుండా వైసీపీ నాయకులు అధికారుల ద్వారా అడ్డుపడుతున్నారని, తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నానని పేర్కొంది.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

అక్రమ తొలగింపులను ఆపాలి

▸ కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : స్కీం వర్కర్ల అక్రమ తొలగింపులను ఆపాలంటూ కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూసీ నాయకులు మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, స్కీం వర్కర్లపై రాజకీయ కక్షసాధింపులు జరుగుతున్నాయన్నారు. ఎవరైనా తప్పుచేస్తే షోకాజ్ నోటీసులు ఇవ్వవచ్చుకాని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. అంగన్వాడి, మధ్యాహ్న భోజనం కార్మికులను, స్కూలు శానిటైజర్ కార్మికులను వేధిస్తున్నారన్నారు. అంగన్వాడీ వర్కర్ల జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ, స్కీము వర్కర్లను అక్రమంగా తొలగించడం తగదన్నారు. మధ్యాహ్న పథకం జిల్లా సంఘ అధ్యక్షురాలు సమ్మక్క మాట్లాడుతూ, రూ.3 వేల గౌరవ వేతనం తీసుకునే వాళ్లపై చర్యలు తీసుకుంటామని వేధిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

▸ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ, జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సందర్శించామని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నామన్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేవని, మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. కొన్ని గృహాలు శిథిలావస్థకు చేరాయన్నారు. బాలికలకు మూడు నెలల నుంచి శానిటరీ ప్యాడ్లు ఇవ్వడం లేదన్నారు. వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న కుక్, వాచ్‌మెన్ తదితర పోస్టులను భర్తీ చేయాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు హాస్టల్‌లో ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కన్వీనర్ సాధిక్, నాయకులు సూరజ్, అనూష, జీవని, అమృత, సన్నీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

జి.కొండూరు, ఆగస్టు 5 : గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబరు 117ను పున సమీక్ష చేసి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డీపీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెదగమళ్ల నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జీవో 117 వల్ల ఎంపీపీ పాఠశాలల్లో 1, 2 తరగతులకు అడ్మిషన్లు గణనీయంగా తగ్గుతున్నాయని, ఉన్నత పాఠశాల్లో ఉన్న మూడు, నాలుగు తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి ప్రాథమిక పాఠశాలలకు బదలాయించాలని కోరారు. నెలవారి ప్రమోషన్లు చేపట్టాలని, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లను హెచ్.ఎంలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఈప్రక్రియ ముగిసిన అనంతరమే పని సర్దుబాటు చేయాలని ఆయన కోరారు.

అర్ధరాత్రి హైడ్రామా!



దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తత

▸ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో రగడ.. ఉద్రిక్తత

▸ నెల రోజులుగా రెండు వర్గాల మధ్య ఘర్షణ

▸ అర్ధరాత్రి పిల్లర్ల నిర్మాణం.. పోలీసుల మోహరింపు

▸ అధికారుల హామీతో ఆందోళన విరమణ

పెడన, ఆగస్టు 5 : పట్టణంలోని 6వ వార్డు దళితవాడలో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారీగా పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. గత నెల 21న దళితవాడలోని ప్రభుత్వ స్థలంలో ఒక వర్గం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయగా మరో వర్గం వ్యతిరేకించడంతో స్థానికంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేసి పరిస్థితిని చక్కదిద్దారు. అప్పటి నుంచి పోలీసు పికెట్ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. ఆదివారం అర్ధరాత్రి ఒక వర్గానికి చెందిన మహిళలు అంబేడ్కర్ విగ్రహం చుట్టూ పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. కానిస్టేబుల్ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేయడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పిల్లర్ల నిర్మాణం అడ్డుకోగా.. మహిళలు ఆందోళనకు దిగారు. మునిసిపాలిటీ నుంచి అనుమతి తీసుకున్నాక పిల్లర్ల నిర్మాణం చేపట్టాలని పోలీసులు సూచించినా.. పిల్లర్లు నిర్మించే తీరుతామని మహిళలు భీష్మించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మునిసిపల్, పోలీసు, రెవెన్యూ అధికారులు మహిళల తాలూకా పెద్దలతో సోమవారం తెల్లవారుజామున 4 గంటల వరకు చర్చలు జరిపారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పెద్దల సూచన మేరకు మహిళలు ఆందోళన విరమించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

సంక్షేమ పథకాలను విజయవంతం చేస్తాం

▸ సచివాలయ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కోటేశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 5 : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఉన్నతస్థాయి అధికారులతో కమిటీ వేసి వారి సమస్యలను త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. పరిష్కరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేసినందుకు రావాల్సిన బకాయిలను మంజూరు చేయాలన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్ అయినప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ కల్పించాలని కోరారు. బహుళశాఖ విధానం లేకుండా ఉద్యోగులపై వారి మాతృశాఖ మాత్రమే అజమాయిషీ ఉండాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రత్నం, సహాధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు హరి, రవికుమార్ రెడ్డి, ఆశోక్‌కుమార్, మోహన్‌రావు, కోలా నాగబాబు, మారుతి ప్రసాద్, వెంకట్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిట్టల్లంకలో ఇసుక అక్రమ రవాణా

కోడూరు : మండల పరిధిలోని పిట్టల్లంక గ్రామ సమీపంలోని కృష్ణా నది నుంచి పలువురు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కృష్ణానది నుంచి పడవలపై తీసుకొచ్చి ట్రాక్టర్లలో డంపింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటంతోనే అక్రమ రవాణా కొనసాగుతున్నదని, దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా రెవెన్యూ అధికారులకు చీమకుట్టినట్లైనా లేదని వాపోతున్నారు. సోషల్ మీడియాలో కథనాల మేరకు కోడూరు ఎస్ఐ పి.శిరీష ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. అదేవిధంగా మద్యం, రేషన్ బియ్యం రవాణా కథనాలకు రెవెన్యూ, సివిల్ సప్లయిస్, ఎస్ఈబి అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



కృష్ణానది నుంచి పడవల్లో ఇసుక తరలిస్తున్న వ్యక్తులు

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపండి : డీఆర్వో

కృష్ణలంక, ఆగస్టు 5 : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపినప్పుడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యం నెరవేరుతుందని, జిల్లా అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వల్లభనేని శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా డీఆర్వో వి.శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన, మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించడం ద్వారా అర్జీదారుల అభినందన అందుకోవడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చిన వారవుతారన్నారు. క్షేత్రస్థాయి అధికారుల సమన్వయంతో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు

పట్టణంలో దాహం కేకలు!

▸ నాలుగు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

▸ ఇంకా పట్టాలెక్కని పైలెట్ ప్రాజెక్టు

▸ పెరిగిపోతున్న అంచనా వ్యయం

తిరువూరు, ఆగస్టు 5 : పట్టణంలో గత నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంపింగ్ స్కీమ్ వద్ద మెయిన్ పైపులైన్ లీకు సాకుతో పట్టణంలో నీటి సరఫరా నిలుపుదల చేయడం మునిసిపాలిటీకి పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలతో వాగుల్లో నీటి ప్రవాహం ఉన్నా తాగునీటి సరఫరా నిలిచిపోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు. శిథిలమైన పైపులైన్లు తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయని, వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రస్తావించగా, ఫెర్రీ నుంచి తాగునీటి సరఫరా పథకంలో కొత్త లైను వస్తుందని మునిసిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారని, మరమ్మతుల పేరుతో బిల్లులు పెట్టుకోవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాగునీటి పైలెట్ ప్రాజెక్టుపై అనుమానాలు?

పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంక్ (ఎఐఐబి) నిధులతో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడంలేదు. ఈ ఏడాది జూలై నాటికి ప్రాజెక్టు అగ్రిమెంట్ పూర్తవడంతో, మునిసిపల్ అధికారులు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. స్థానిక శాంతినగర్ ఎంపీడీవో కార్యాలయ సమీపంలో పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టిన 10లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం, పునాదిలోనే నిలిచిపోయింది. వార్డుల్లో రూ.21.69 కోట్లతో చేపట్టిన పైపులైన్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా, పలు వార్డుల్లో సిమెంట్‌రోడ్లు ధ్వంసం చేశారు.



అంచనాలకే పరిమితమైన ప్రాజెక్టు..

ఫెర్రీ నుంచి తిరువూరుకు కృష్ణాజలాలు తరలించేందుకు డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూ.98 కోట్లతో రూపొందించిన ప్రాజెక్టు అంచనాలు ప్రస్తుతం రూ.162.74 కోట్లకు చేరింది. ఎఐఐబి అగ్రిమెంట్ ఈ ఏడాది జూలైతో పూర్తవడంతో తిరిగి పునరుద్ధరించేందుకు, ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుత ధరల ప్రకారం ప్రాజెక్టు అంచనాలు రూ.200 కోట్లకు పెరిగే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నూతన పైపుల ఏర్పాటు

- మునిసిపల్ కమిషనర్ లోవరాజు

పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి పంపింగ్‌స్కీమ్ వద్ద పైపులు పగిలిపోవడంతో నీటి సరఫరాకు అతరాయం కలిగింది. యుద్ధప్రాతిపదికన కొత్తవి నిర్మిస్తున్నాం. పైపులైను ఏర్పాటుకు సంబంధించి ఇసుక లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. నందిగామ నుంచి ఇసుక తెప్పించి పైపులు నిర్మిస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా తాగునీటి సరఫరా పునరుద్దరిస్తాం. తాగునీటి పైలెట్ ప్రాజెక్టుకు అగ్రిమెంట్ గడువు ముగియడంతో కొత్తగా అగ్రిమెంట్ సిద్ధం చేస్తున్నాం.

దిశానిర్దేశం

(5వ పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు.

- జిల్లాల విభజన జరిగాక గ్రామీణ నీటిసరఫరా విభాగంలో ఎస్ఈ పోస్టుల్లో అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో, ఆ విభాగంలో రూ.40 లక్షలకు మించి పనులు చేసేందుకు అనుమతులు మంజూరు చేయలేని పరిస్థితి ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఎస్ఈ పోస్టుల్లో ఎస్ఈ స్థాయి అధికారులను పూర్తిస్థాయి అధికారాలతో భర్తీ చేయాలని కలెక్టర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో కమిటీని వేసి తగు నిర్ణయం తీసుకుంటామని సీఎం సూచించారు.
- హైకోర్టు ధిక్కరణ కేసులను ప్రభుత్వం తరఫున వాదించేందుకు నిష్ణాతులైన న్యాయవాదులను నియమించాలని కలెక్టర్ బాలాజీ కోరారు. జిల్లాకో న్యాయవాదిని నియమించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరగా, ముఖ్యమంత్రి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ప్రధానమైన కొన్ని అంశాలను కలెక్టర్ల సదస్సులో తెలియజేశామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. కాగా, కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జేసీ గీతాంజలిశర్మ, ఇతర జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

చివరి కష్టాలు

(5వ పేజీ తరువాయి)

పొలాలకు మళ్లిస్తున్నారు. దీంతో కొర్లపాడు నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపట్నం కాల్వకు సాగునీరు అందడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలు, కాల్వ ద్వారా వచ్చిన నీటిని ఆధారంగా చేసుకుని పెదపట్నానికి చెందిన రైతులు నారుమడులు పోశారు. ప్రస్తుతం నీరు అందుబాటులోకి రాకపోడంతో నారుమడులను బతికించుకునేందుకైనా సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడటంలేద ని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా పెదపట్నం గ్రామ రైతులు స్వచ్ఛందంగా కాల్వలోని తూడు, నాచు తొలగించే పనులు చేసుకుంటున్నారు. అయినా ఈ కాల్వకు నీటిని విడుదల చేయలేదని రైతులు అంటున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి పెదపట్నం కాల్వకు నీటిని విడుదల చేసి నారుమడులను బతికించాలని రైతులు కోరుతున్నారు.

- కృత్తివెన్ను మండలంలోని కృత్తివెన్ను, సీతనపల్లి, నీలిపూడి, కొమాళ్లపూడి, మునిపెడ, యండపల్లి, చెరుకుమిల్లి తదితర గ్రామాల్లో అధికశాతం రైతులు ఇంతవరకు నారుమడులు పోయలేదు. సాగునీరు కాల్వల ద్వారా పూర్తిస్థాయిలో రాకపోవడంతో నారుమడులు పోసినా, వాటిని బతికించుకోవడం కష్టమనే కారణంతో ఎక్కువమంది ఈ నిర్ణయం తీసుకున్నారు. కాల్వలకు పుష్కలంగా నీరు విడుదల చేస్తే పశ్చిమగోదావరి జిల్లా నుంచి, బంటుమిల్లి, పెడన మండలాల నుంచి వరినారు కొనుగోలు చేసి నాట్లు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. బంటుమిల్లి కెనాల్ ద్వారా బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు సాగునీరు అందాల్సి ఉంది. మల్లేశ్వరం వంతెన వద్ద నీటిమట్టం నాలుగున్నర నుంచి ఐదు అడుగుల మేర ప్రవహిస్తుంటే, శివారు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. సోమవారం సాయంత్రం మల్లేశ్వరం వంతెన వద్ద 3.1 అడుగుల నీటిమట్టం మాత్రమే ఉంది. దీంతో దిగువ ప్రాంతానికి నీరు చేరడం లేదు. చేరినా పొలాల్లోకి నీరు పెట్టడానికి అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది.
- కోడూరు మండలంలో కోడూరు ఈస్ట్ చానల్‌కు అనుబంధంగా ఉన్న 14వ నెంబరు కాల్వకు నీరు ఇంకా విడుదల చేయలేదు. దీంతో మండల పరిధిలోని ఊటగుండం, బసవవానిలంక, రామకృష్ణాపురం గ్రామాల రైతులు నారుమడులు పోసేందుకు అవకాశం లేకుండా పోయింది. సాగునీరు విడుదల చేస్తే నారుమడులుపోసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.
- మొవ్వ మండలం వేములమడ గ్రామంలోని పొలాలకు సాగునీరు అందకపోవడంతో రైతులు సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తహసీల్దార్ మస్తాన్‌రావు, నీటిపారుదల శాఖ ఏఈ సత్యనారాయణ గ్రామానికి వచ్చి సాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మండలంలో రైతులు బోరునీరు లేదా కాల్వల ద్వారా వచ్చే నీటిని ఆయిల్ ఇంజన్లతో పొలాలకు పంపుతున్నారు.

ఎరువుల ముడిసరుకుపై జీఎస్టీ తగ్గించారా

▸ పార్లమెంటులో ఎంపీ బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల తయారీలో వాడే ముడిసరుకులపై జీఎస్టీని ఎంతమేర తగ్గించారని సోమవారం జరిగిన పార్లమెంటు సమావేశంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నించారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించినా, తుది నిర్ణయం తీసుకోలేదనే అంశంలో వాస్తవమెంత అని అడిగారు. పార్లమెంట్‌లోని రసాయనాలు, ఎరువుల స్టాండింగ్ కమిటీ ఎరువుల ముడిసరుకులపై జీఎస్టీని 18శాతం నుంచి5శాతానికి తగ్గించాలని సిపార్సు చేసిందని, జీఎస్టీ కమిటీ ఈ అంశాన్ని మంత్రుల కమిటీకి పంపిందని, మంత్రుల కమిటీ నిర్ణయం తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి సమాధానమిస్తూ ఎరువుల ముడిసరుకులపై జీఎస్టీని తగ్గించే అంశంపై జీఎస్టీ కౌన్సిల్ 25, 28, 31, 45, 53 సమావేశాల్లో చర్చించిందన్నారు. 25వ సమావేశంలో 12రకాలకు చెందిన బయోపెస్టిసైడ్స్‌పై జీఎస్టీని 18శాతనుంచి 12శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసినట్టు తెలిపారు. అమ్మోనియా వంటి ఎరువుల ముడిసరుకులు, సల్ఫ్యూరిక్‌యాసిడ్‌పై జీఎస్టీని తగ్గించాలని మంత్రుల బృందం సిపార్సు చేసిందని చెప్పారు. ఈఅంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

ఐదేళ్లు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు

▸ మంత్రి కొల్లు రవీంద్ర



వన్‌టౌన్, ఆగస్టు 5 : వైసీపీ వాళ్లు శనిలా దాపురించారని, వారి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెయ్యి గొడ్లను తిన్న రాబందు నీతి వాక్యాల్లా మాజీ మంత్రి పేర్ని నాని మాటలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల దాడులు, దౌర్జన్యాలు, హత్యాచారాలతో పైశాచిక ఆనందం పొందిన వైసీపీ బ్యాచ్ ఇప్పుడు నీతులు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యాంగం, ప్రజల గురించి ఇప్పుడు మాట్లాడటం శోచనీయమన్నారు. ఆ ఐదేళ్ల ప్రజలకు క్షణ క్షణం గండంలా మారిందన్నారు. న్యాయం కోరిన అమరావతి రైతులు, మహిళలపై దాడులు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపైకి గంజాయి ముఠాను పంపి దాడి చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుని తిరుగుతున్నారన్నారు. తప్పు చేసిన అధికారులను చట్ట ప్రకారమే శిక్షిస్తామని నారా లోకేశ్ ప్రకటించిన నాటి నుంచి పేర్ని నాని వంటి అరాచక శక్తుల గుండెల్లో వణుకు మొదలైందన్నారు. రెడ్ బుక్ చూసి భయపడుతున్నారన్నారు. పేర్ని నాని ఇప్పటికైనా చేసిన తప్పులకు ప్రజలను క్షమాపణ కోరితే మంచిదన్నారు.

కలెక్టరేట్ ఏవోగా వీరాంజనేయ ప్రసాద్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : కలెక్టరేట్ ఏవోగా సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎన్నికల విభాగంలో వీరాంజనేయ ప్రసాద్ పనిచేశారు. గతంలో మొవ్వ తహసీల్దార్‌గా పనిచేసిన ఈయన కలెక్టరేట్‌లో ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో వాణిని మర్యాద పూర్వకంగా కలిశారు.



తునికిపాడులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

50 రోజుల తర్వాత గ్రామంలోకి వైసీపీ నేత..

తునికిపాడులో ఉద్రిక్తత!

గంపలగూడెం, ఆగస్టు 5 : ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులను తీవ్ర వేధింపులకు గురిచేసిన మండల వైసీపీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు సోమవారం సొంత గ్రామం తునికిపాడుకు రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి కూటమి ప్రభుత్వం వచ్చాక చావా వెంకటేశ్వరరావు తునికిపాడు గ్రామాన్ని వదిలి మధిరకు మకాం మార్చాడు. నాటి నుంచి తునికిపాడు వైపు రాలేదు. 50 రోజుల తర్వాత అకస్మాత్తుగా వెంకటేశ్వరరావు తునికిపాడులోని సొంత ఇంటికి రావడంతో వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పులి వచ్చింది.. సింహం వచ్చింది.. అంటూ స్టేటస్‌లు పెట్టడంతో టీడీపీ వర్గీయులు రగిలిపోయారు. కొందరు అతడి ఇంటిపై దాడికి యత్నించగా సీఐ నబీ, ఎస్సై శ్రీను, సిబ్బంది అడ్డుకున్నారు. టీడీపీ వర్గీయులను అక్కడి నుంచి పంపివేసి చావా వెంకటేశ్వరరావును మైలవరం స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో..

మరో ఐదుగురికి రిమాండ్

గన్నవరం, ఆగస్టు 5 : స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వైసీపీ మూకలను మరో ఐదుగురిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు. సోమవారం విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెండెం రాంబాబు, షేక్ ఇమ్రాన్, షేక్ ఇర్ఫాన్, గంగా అమరేంద్రనాథ్ రెడ్డి, సయ్యద్ సిద్దిక్‌లను గన్నవరం పోలీసులు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించి నెల్లూరు సెంట్రల్ జైల్‌కు తరలించారు. ఈ కేసులో 71 మంది ఉండగా ఇప్పటి వరకూ 25 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారికోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

'మీ కోసం' అర్జీలు పరిష్కరించండి

మచిలీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణితో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. 'మీకోసం' కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే అర్జీలపైనా దృష్టి సారించాలన్నారు. కోర్టు కేసులను పూర్తిస్థాయిలో పరిశీలించి కౌంటర్‌లు దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 5 : స్థానిక విజయవాడ రోడ్డులోని హనుమాన్‌నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు అధికారులను కోరారు. ఈ మేరకు కాలనీ వాసులు గ్రామ టీడీపీ నాయకుడు కొమ్మిరిశెట్టి కుమార్ నాయకత్వంలో సంతకాల సేకరించి హనుమాన్‌జంక్షన్ సెక్షన్ విద్యుత్ కార్యాలయం ఏఈ శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా కాలనీలో లోవోల్టేజీ సమస్య వెంటాడుతోందని తరుచు ఫీజులు పోవడంతో పాటు టీవీలు, మోటార్లు పని చేయని పరిస్థితి ఎదురవుతోందని ఏఈకి వివరించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం, ఆగస్టు 5 : తన భార్య కనిపించడం లేదని ఓ వ్యక్తి సోమవారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన మహిళ(23) స్థానిక వాటర్ ప్లాంట్‌లో పని చేస్తుంటుంది. ఆదివారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. రాత్రి ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసిన కుటుంబ సభ్యులకు మహిళ ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

కంకిపాడు, ఆగస్టు 5 : మండలంలోని నెప్పల్లి సెంటర్‌లోని ఓ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన దొడ్డ గణేష్ నెప్పల్లి సెంటర్‌లో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం దుకాణానికి తాళం వేసి సోమవారం ఉదయం తిరిగి వచ్చాడు. షాపు తెరిచి చూసే సరికి షాపుపై భాగంలో ఉన్న రేకులు తొలగించి షాపులో ఉన్న రూ. 60 వేలు అపహరించుకుపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై డి. సందీప్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 5 : ఆయిల్ పామ్ సాగులో అధిక దిగుబడులను సాధించేందుకు తీసుకోవాలిసిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానవన శాఖ, పతంజలి ఫుడ్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉద్యానవనశాఖ అధికారి హరిశ్చంద్ తెలిపారు. వేలేరులోని బీ సెంటర్‌లోని కె.రాజాగోపాలకృష్ణ ఆయిల్‌పామ్ తోటలో (పోలవరం కాలువ సమీపంలో) నిర్వహించే రైతు శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి, శాస్త్రవేత్త ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొంటారని వివరించారు. ఆయిల్‌పామ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని హరిశ్చంద్ కోరారు.

ఉయ్యూరు నగర కమిషనర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉయ్యూరు, ఆగస్టు 5 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలోని 10.67 ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమించి, భవన నిర్మాణాలు చేసిన వారి వివరాలు ఇవ్వాలని 2021 సంవత్సరం నుంచి కోరుతున్నా సమాచారం ఇవ్వని నగర పంచాయతీ కమిషనర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. వక్ఫ్ భూమిలో భవన నిర్మాణాలకు అనుమతిచ్చిన కమిషనర్లపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు శ్రీనివాస గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జాస్తి విజయలక్ష్మి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 5 : స్థానిక ఏలూరు రోడ్డు తిమ్మనీడు గ్రామంలో జాస్తి చారిటబుల్ ట్రస్ట్ పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేసింది. ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రస్ట్ చైర్మన్ జాస్తి విజయలక్ష్మి తన మనవరాలు అభిరామకృష్ణ జన్మదినం పురస్కరించుకొని 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కృష్ణకుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 5 : కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్న అన్నారు. కోడూరుపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త సాగాల సోవమ్మ(70) ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా గ్రామంలో పార్టీ కోసం కృషి చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గరికపాటి నాగబాబు, వెంకటేశ్వరరావు, అంబటి రాజా, శంకర్, చందు చిరంజీవి, పుల్లయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 5 : నవజాత శిశువుకు బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి ఇచ్చే పసుపు రంగు (ముర్రుపాలు) అమృతంతో సమానమని సర్పంచ్ పిల్లా అనిత తెలిపారు. వీరవల్లి, వేలేరు, కొత్తపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. వీరవల్లి శాలివాహన కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఏఎన్ఎం నాగమణి, హెచ్ఎం భగీరథ పాల్గొన్నారు. కొత్తపల్లిలో కోటేశ్వరమ్మ, జ్యోతి కుమారి, బీబీజాన్ పాల్గొన్నారు. వేలేరులో అక్కమ్మ, హైమవతి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచ్ పిల్లా అనిత

మెరుగైన సేవలందించాలి

నూతన తహసీల్దార్లకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన



యార్లగడ్డను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్లు

ఉంగుటూరు, ఆగస్టు 5 : ప్రజలకు అందుబాటులో ఉంటూ, పేదలకు అన్నివిధాలుగా సహకరిస్తూ, మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నూతన తహసీల్దార్లకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేవిధంగా నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును విజయవాడ రూరల్ మండలంలోని ఆయన కార్యాలయంలో నియోజక వర్గంలోని మూడు మండలాల నూతన తహసీల్దార్లు కుటుంబ సమేతంగా సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గన్నవరం, విజయవాడరూరల్ మండలాల్లో నూతన తహసీల్దార్లుగా కె.వి.శివయ్య, బి.సుగుణ సోమవారం బాధ్యతలు స్వీకరించగా, ఉంగుటూరు తహసీల్దార్‌గా జె.విమలకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ముగ్గురు తహసీల్దార్లకు ఎమ్మెల్యే యార్లగడ్డ అభినందనలు తెలియజేశారు.

పెనమలూరు తహసీల్దార్‌గా గోపాలకృష్ణ

పెనమలూరు : పెనమలూరు నూతన తహసీల్దారుగా కలగర గోపాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా రాజోలులో తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై పెనమలూరు వచ్చారు. గతంలో పని చేసిన పీఎస్డీ ప్రసాద్ భీమవరం కలెక్టరేట్ ఏఓగా బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌కు డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కంకిపాడు తహసీల్దార్‌గా భవన్నారాయణ

కంకిపాడు : కంకిపాడు తహసీల్దార్‌గా భవన్నారాయణ సోమవారం బాధ్యత చేపట్టారు. నందివాడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనను కంకిపాడు బదిలీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనను గ్రామ రెవెన్యూ అధికారులు కంచర్ల ఏడుకొండలు, విజయ్‌కుమార్, మద్దూరు రఘు రామప్రసాద్, సందీప్, దుర్గారావమ్మ, సుబ్రహ్మణ్యం తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఉయ్యూరు తహసీల్దార్‌గా సురేశ్‌కుమార్

ఉయ్యూరు : ఉయ్యూరు మండల తహసీల్దార్‌గా ఎమ్. సురేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీవో డి. రాజును కలసి పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలు స్వీకరించినట్టు తెలియజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి సత్వరం సేవలందించాలని సూచించారు.



తహసీల్దార్ భవన్నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ ఉద్యోగులు



పెనమలూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కె. గోపాలకృష్ణ

అఖిల భారత చిరంజీవి యువత జిల్లా కార్యదర్శిగా యర్రంశెట్టి బాబీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 5 : సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచేందుకు బొమ్ములూరుకు చెందిన యర్రంశెట్టి బాబీని ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శిగా నియమించారు. జాతీయ చిరంజీవి యువత గౌరవ అధ్యక్షుడు కొణిదెల నాగబాబు నుంచి అఖిల భారత చిరంజీవి యువత కృష్ణాజిల్లా కార్యదర్శిగా నియామకపు ఉత్తర్వులను బాబీ సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ, అధ్యక్షుడు స్వామినాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సేవా, సహాయ కార్యక్రమాల ద్వారా అందరినీ కలుపుకునిముందుకు సాగుతామని తెలిపారు.

రూ. కోటి విరాళం ప్రకటించటం హర్షణీయం

కంకిపాడు : వరదలతో అతలాకుతలమైన కేరళ రాష్ట్రాన్ని ఆదుకునేందు కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన కుమారుడు రామ్‌చరణ్ ముందుకు రావడం హర్షణీయమని చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేరళలో సంభం వించిన విపత్తుకు మెగాఫ్యామిలీ ముందు కొచ్చి తమ వంతు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, జరుగు శ్రీనివాసరావు, చిరంజీవి యువత నాయకులు బాయిశెట్టి సుధీర్, చిట్టిగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ లయన్స్ క్లబ్‌కు పురస్కారాలు



ఉత్తమ సేవా పురస్కారాలతో జంక్షన్ లయన్స్ క్లబ్ నాయకులు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 5 : గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం విష యాల్లో విశేషసేవలు అందించినందుకుగాను లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్‌కు ఉత్తమ సేవా పురస్కారాలు లభించినట్లు క్లబ్ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగిన మహదేవ్ అవార్డ్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లా గవర్నర్ శంకర్ గుప్తా చేతులు మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. ఉత్తమ అధ్యక్షుడిగా చలసాని వెంకటేశ్వరరావు, ఉత్తమ కార్యదర్శిగా అక్కినేని రాఘవేం ద్రరావు, ఉత్తమ కోశాధికారిగా కళ్లేపల్లి నారాయణరావు, రీజనల్ చైర్మన్ నందిగం స్వామి, కార్యదర్శి అక్కినేని శ్రీనివాస ఫణీంద్రలు ప్రత్యేక పురస్కారాలు అందుకున్నట్లు తెలియజేశారు.

మర్యాదపూర్వక కలయిక

విజయవాడ, బందరు ఎంపీలను కలిసిన బొర్రా గాంధీ



ఎంపీ కేశినేని చిన్నికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొర్రా గాంధీ

పెనమలూరు, ఆగస్టు 5 : పోరంకి టీడీపీ నాయకుడు బొర్రా రాధాకృష్ణ (గాంధీ) విజయవాడ, బందరు ఎంపీలు కేశినేని చిన్ని, వల్లభనేని బాలశౌరిలతో సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయవాడ చుట్టూ జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలు, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల గురించి వారితో చర్చించారు. నూతనంగా ఎన్నికైన ఎంపీలను సన్మానించారు. ఆయన వెంట ఎం చక్రధర్, లీలాప్రసాద్ తదితరులు ఉన్నారు.

సొంత నిధులతో దారి అభివృద్ధి



రోడ్డుపై పోసిన కంకర మిక్సింగ్

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 5 : స్థానిక నూజివీడు రోడ్డు ఎంజీనగర్ కాలనీలో నివాసాల మధ్య అధ్వానంగా మారిన దారిని శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ తన సొంత నిధులు వెచ్చించి కంకర మిక్సింగ్‌తో అభివృద్ధి పరిచారు. ఎన్నికల ప్రచార సందర్భంలో టీడీపీ నాయ కులకు కాలనీ వాసులు అధ్వానంగా మారిన మార్గాన్ని చూపించి నడవడానికి కూడా చాలా ఇబ్బందిగా మారిందని టీడీపీ నాయకుల దృష్టికి తెచ్చారు. దీంతో సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు సత్యప్రసాద్ చొరవ తీసుకొని తన ట్రస్ట్ నిధులు వెచ్చించి సోమవారం మార్గాన్ని అభివృద్ధి పరిచారు. దీంతో కాలనీ వాసులు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కడవకొల్లు నాగరాజు, తాడిశెట్టి శ్రీనివాసరావు, బోను ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బురదకయ్యలుగా రోడ్లు



చిక్కవరంలో రోడ్డు

గన్నవరం, ఆగస్టు 4: మండలంలోని చిక్కవరం ఎస్సీ కాలనీలో రోడ్లు బురద కయ్యలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయినేజీలు లేకపోవటం వల్ల మురుగునీరంతా రోడ్ల మీదకు చేరుతోంది. ఆ బురద లోనే వృద్ధులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు పోయేందుకు పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని ఐదేళ్లుగా డ్రెయిన్ల పూడిక తీసిన దాఖలాలు లేవని ఏమాత్రం పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ● గన్నవరం కరెంట్ ఆఫీస్‌లో మురుగు తిష్టవేసింది. పల్లం కావటంతో నీరంతా ఏఈ గది ఎదురు నిలిచిపోతుంది. కరెంట్ వినియోగదారులు ఆఫీస్‌కి వచ్చినప్పుడు మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కపిలేశ్వరపురం వెళ్లే జడ్పీ రోడ్డు..

ఉయ్యూరు : ఉయ్యూరు ఎస్సీ కాలనీ నుంచి కపిలేశ్వరపురం వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డు బురదకయ్యగా తయా రవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలచి బురదగా తయారవడం, రోడ్డు ఇరువైపులా పొదలు, పిచ్చి మొక్క లు గుబురుగా పెరిగిన పరిస్థితుల్లో ఈరోడ్డు ద్వారా పొలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతుకూలీలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డును పట్టించు కోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారు లేరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.



ఉయ్యూరు- కపిలేశ్వరపురం జడ్పీ రోడ్డు

రేపటి నుంచి లింగ సమానతపై శిక్షణ



కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శివాజీబాబు

పెనమలూరు, ఆగస్టు 5 : రేపటి (బుధవారం) నుంచి మూడు రోజుల పాటు స్థానిక వీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో లింగ వివక్ష, లింగ సమానత గురించిన జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివాజీబాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పీ ఆదిలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమ బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక ప్రణాళికాదారులు, బడ్జెట్ ప్రణాళిక, అమల్లో ఉన్న ఇతర వాటాదారులకు కలిగే ప్రయోజనాల గురించి చర్చిండం జరుతుందని తెలిపారు. లింగ సమానత్వాన్ని సాధించడానికి సమాజంలోని వివిధ వర్గాలను సంసిద్ధ పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి వివిధ శాఖల నుంచి ప్రభుత్వ అధికారులు, పంచాయతీరాజ్ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిశీలన

రికార్డులు పరిశీలించిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ

గన్నవరం, ఆగస్టు 5 : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ అదనపు ఐజీ ఎం.ఉదయ్‌భాస్కరరావు పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ముఖ్యంగా రెండవ కొత్త వెర్షన్‌లో రిజిస్ట్రేషన్‌లు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు ప్రయోజనాలు గురించి తెలుసుకున్నారు. డాక్యుమెంట్‌లు రూపొందించడంలో సాంకేతిక సమస్యలు గురించి వాకాబు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకుగాను ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా రిజిస్ట్రేషన్ల విధానంలో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. తొలుత సబ్ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరావు మినహా ఇతర సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.4.30

ఫొటోగ్రాఫర్ల సంఘ భవనానికి స్థలం కేటాయించండి

మచిలీపట్నం టౌన్ : ఫొటోగ్రాఫర్ల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని మంత్రి కొల్లు రవీంద్రకు ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు చిలంకుర్తి శేషు తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఫొటోగ్రాఫర్లకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు.

నేత్రదానం

బంటుమిల్లి : ముంజులూరుకు చెందిన దివి సావిత్రి (76) ఆదివారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్ట్యూట్ వైద్యులు ఆమె నేత్రాలను సేకరించారు. నేత్రాలను దానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలి



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 : ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇనకుదురుపేటలో పీవీఆర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించి ప్రసంగించారు. పేదలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మం దులు అందజేయడం ముదావహమన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలి యాస్ పాషా, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని తదితరులు పాల్గొన్నారు. పీవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పి. రామకృష్ణ, ఎండి అల్తాఫ్ హుస్సేన్, సమీరా, సల్మా, ప్రదీప్, సంజయ్, వినయ్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

న్యూక్లియర్ ఎనర్జీపై అవగాహన ఉండాలి



బంటుమిల్లి : న్యూక్లియర్ ఎనర్జీ, రేడియేషన్ రహిత విధానాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హోమిబాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్లో న్యూక్లియర్ ఇంధన ఉపయోగాలపై ఆయన మాట్లాడారు. న్యూక్లియర్ ఇంధనంతో భవిష్యత్ విద్యుత్ అవసరాలు ఏవిధంగా తీర్చుకోవచ్చో వివరించారు. మల్లేశ్వరం గ్రామంలో జన్మించిన కొమ్మారెడ్డి పూర్వ విద్యార్థి అయిన శ్రీరామచంద్రమూర్తి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో ఉన్నత స్థాయి ప్రొఫెసర్‌గా ఎదగడాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ శోభ, హెచ్ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడలో మంత్రి భరత్ పుట్టినరోజు వేడుకలు

గుడివాడ : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంత్రి టి.జి భరత్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. నెహ్రూచౌక్ సెంటర్‌లో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గోవకరపు సునిల్ ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి పాల్గొని కేక్‌ను కట్ చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, రక్తదానం చేశారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఆర్యవైశ్య నాయకులు తిరువీధి సుబ్బారావు, సూరే గాంధీ, బెజవాడ బాజేశ్వరరావు, పరిశే వెంకటేశ్వరరావు, తాడిపర్తి సురేష్, ఇడుపుల జగత్, దోసపాటి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి



మచిలీపట్నం టౌన్ : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా విధానం ద్వారా టెన్త్, ఇంటర్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి అధికారులకు సూచించారు. సోమవారం విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ, ఏ విధమైన విద్యార్హత లేకున్నా 14 ఏళ్లు నిండిన వారు 10వ తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ కోర్సులో చేరవచ్చన్నారు. ఈనెల 28వ తేదీ లోగా రుసుము చెల్లించి 10, ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చన్నారు. డీఎల్‌పీవో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పామర్రులో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ



పెదపారుపూడిలో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అరుణ కుమారి

తల్లిపాలు శ్రేష్ఠం..బిడ్డకు ఆరోగ్యకరం

పామర్రు, ఆగస్టు 5 : తల్లిపాలు పుట్టిన బిడ్డకు ఎంతో శ్రేష్ఠం, ఆరోగ్యకరమని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై సోమవారం మూడో సచివాలయం పరిధిలోని ప్రజలకు, బాలింతలకు భానుశ్రీ అవగాహన కల్పించారు. ఏఎన్ఎం విజయభాను, స్టీఫెన్, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, ఆరోగ్య సేవకులు పాల్గొన్నారు. **నందివాడ :** నాల్గో సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ ఆధ్వర్యంల తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నందివాడ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ, పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు తల్లిపాలు తాగే బిడ్డలకు శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందన్నారు. సూపర్‌వైజర్ నాగ శిరీష, లక్ష్మీ సామ్రా జ్యం, వకుళ, టి.వెంకటరమణ, సీతామహాలక్ష్మి, రాజేశ్వరి, సుభాషిణి, ఆశా వర్కర్లు మల్లేశ్వరి, సుధారాణి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు. **గుడివాడ :** పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సుష్మభారతి అన్నారు. బేతవోలు, నిమ్మతోటల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు నిర్మల, వెంకటేశ్వరమ్మ, డి.వి.రమణ, కె.ఝాన్సీ రాణి, ఆయాలు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** పుట్టిన గంట లోపే బిడ్డకు తల్లి మురిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. పెదపారుపూడి అంగన్వాడీ సెంటర్‌లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్ చప్పిడి సమీరా హాజరై తల్లిపాల విశిష్టతను తల్లులకు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు. **ముళ్లపూడి(పమిడిముక్కల) :** ముళ్లపూడి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను ఏఎన్ఎం ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీ నున్న పరిమి గీతా వివరించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది జి.ప్రేమలత, బేబి హర్ష పాల్గొన్నారు. **మోపిదేవి :** గ్రామీణ ప్రాంతాల్లో తల్లిపాల విశిష్టతపై మరింత అవగాహన కల్పించాల్సిందిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమాల పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై పెదప్రోలులోని చైతన్యనగర్ అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, ఎంఎన్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదప్రోలులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రత్నమాల



నందివాడలో మాట్లాడుతున్న సీడీపీవో విజయ ఫ్లోరెన్స్

కాల్వలో పడి మెకానిక్ మృతి



గుడివాడ : ప్రమాదవశాత్తు పెద్ద కాలువలో జారిపడి మెకానిక్ బండి ప్రేమ్‌కుమార్ (26) మృతి చెందారు. మెకానిక్ ప్రేమ్‌కుమార్‌కు ఫిట్స్ వ్యాధి ఉంది. కాల్వ వద్దకు వెళ్లిన సమయంలో ఫిట్స్ వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తహసీల్దార్ వనజాక్షి, విజయప్రసాద్‌కు స్వాగతం పలికి సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజలకు ఉత్తమ సేవలందిస్తాం

చల్లపల్లి, ఆగస్టు 5 : ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తామని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి అన్నారు. వనజాక్షి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు డీటీ కుమార్ బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. వనజాక్షి మాట్లాడుతూ రెవెన్యూ సేవలు వేగవంతం చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు.

ఘంటసాల : ఘంటసాల తహసీల్దార్‌గా బి.విజయ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ చప్పిడి చిట్టిబాబు, రీ సర్వే డీటీ శ్రీనివాస్, మండల సర్వేయర్ వల్లి పుష్ప, వీఆర్వోలు ఎస్‌వి.నాగేశ్వరరావు, కర్రా నాగరాజు, టి.రవికుమార్, కార్యాలయ సిబ్బంది, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అందె జగదీష్, జనసేన నాయకులు యార్ల శ్రీకాంత్, గుత్తికొండ సత్యనారాయణ, వుడతా చిత్తరంజన్ సాయి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బందరు సౌత్ తహసీల్దార్‌గా మధుసూదనరావు

మచిలీపట్నం టౌన్ : బందరు సౌత్ తహసీల్దార్‌గా పి. మధుసూదనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్యామ్‌కుమార్ స్వాగతం పలికారు. మధుసూదనరావు మాట్లాడుతూ, విద్యార్థుల కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పామర్రు తహసీల్దార్‌గా రవికాంత్



పామర్రు : పామర్రు తహసీల్దార్‌గా జి.రవికాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రవికాంత్ మాట్లాడుతూ, రైతన్నలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మల్లేశ్వరరావు, వేమూరి గంగాధర్, జగన్మోహనరావు, సుప్రియ, గీతికా, వీఆర్వోలు అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి



మచిలీపట్నం టౌన్ : పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగగలుగుతారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ అందించిన ల్యాప్‌టాప్‌ను సోమ వారం పేద విద్యార్థిని ఎం.లహరికి అందచేశారు. రూ. 70 విలువ గల ల్యాప్‌టాప్ విద్యార్థినికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మొక్కల పెంపకంపై అవగాహన అవసరం

మచిలీపట్నం టౌన్ : బాల్యం నుంచి విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కలిగించాలని సబ్ రిజిస్ట్రార్ జగన్మోహనరావు అన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్టార్ స్కూల్ విద్యార్థులకు జగన్‌మోహనరావు 200 మొక్కలు పంపిణీ చేశారు. విద్యార్థులు తమ ఇళ్ళ వద్ద మొక్కలు నాటి పెం చాలన్నారు. స్టార్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

చల్లపల్లి : వృద్ధాశ్రమాలకు దాతల సహాయం ఆదర్శనీయమని చల్లపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు మోర్ల రాంబాబు అన్నారు. సీయోను వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అగ్రహారానికి చెందిన ప్రముఖ అర్చకులు వేమూరి శ్రీనివాస శర్మ (శీయాన్) కుమారుడు స్వర్గీయ వేమూరి రేవంత్ సంస్మరణార్థం రేవంత్ బాబాయి వేమూరి సత్యనారాయణ శర్మ, కుటుంబసభ్యులు కలిసి అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఆర్థిక స్వేచ్ఛపై అవగాహన సదస్సు

గుడివాడ : ఏఎన్నార్ కళాశాల ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఆర్థిక స్వేచ్ఛ అంశంపై రిసోర్స్‌పర్సన్ జి.సుధాకర్ అవగాహన కల్పించారు. విద్యార్థులు వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టడంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. సెక్యూరిటీస్‌లో పెట్టుబడి పెట్టేముందు ఎలా పెట్టాలి, ఎప్పుడు పెట్టాలి అనే విషయంలో బాగా ఆలోచించి స్టాక్ బ్రోకర్స్ సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, కళాశాల అధ్యక్షులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కార్యదర్శి కె.ఎస్ అప్పారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, ఏంసీఏ విభాగాధిపతి మల్లిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీకోసం సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ రూరల్ : ప్రజలు మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. మీకోసం కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకునేలా చూడాల్సిందిగా సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు ఆమె ఆదేశించారు. ఈవో పీఆర్డీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఏఈవో కాసరనేని అనిత పాల్గొన్నారు.



నిరుపేద ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పించిన పంచాయతీ కార్యదర్శి

అవనిగడ్డ రూరల్ : రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని సర్దా కోడు దళితవాడలో నిరుపేద కుటుంబానికి పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఎస్టీ కులానికి చెందిన తుమ్మా కోటేసు గృహానికి విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో గమనించి రూ.3 వేలు సొంత నిధులు ఖర్చుచేసి పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వాకా రమేష్, గుమాస్తా దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



కాల్వ పూడికతీత పరిశీలన

కోడూరు : సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా కాలువలు బాగు చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు కోరారు. కోడూరు ఈస్ట్ చానల్ 11వ నెంబర్ పంట కాలువ పూడికతీత పనులను టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, మేడా శివాజీ, పిల్లి మల్లిఖార్జునరావు, వేములపల్లి శ్రీకృష్ణ, గోగినేని సోమశేఖరరావు, బండే వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం

అవనిగడ్డ : శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా గీతా మందిరంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి సోమవారం విశేష అభిషేకాలు, అర్చనలు కుంకుమార్చన దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిపారు. శ్రీలలితా సహస్రనామ స్తోత్ర పారాయణను సామూహికంగా పఠనం చేశారు. మందిరం కమిటీ చైర్మన్ వై.శ్రీహరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్ :** శ్రావణ మాస ఆరంభం సందర్భంగా పులిగడ్డలో అలివేలు, మంగ, రాజ్యలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్మశాన వాటికకు రహదారి నిర్మించండి

కోడూరు : కోడూరు, కృష్ణాపురం గ్రామాల మధ్య ప్రధాన పంట కాలువ పక్కన ఉన్న శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ శ్మశాన వాటిక కమిటీ సభ్యులు ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కోడూరు శివారు ఇస్మాయిల్ బేగ్‌పేట, యర్రారెడ్డి పాలెం, నాయుడు పేట గ్రామాలకు చెందిన హిందువుల శ్మశానవాటిక పల్లంగా ఉండటంతో వర్షాకాలం లోపలికి వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందన్నారు. మండల పరిషత్, గ్రామపంచాయతీ నిధులతో కాలిబాట వంతెన దగ్గర నుంచి శ్మశాన వాటిక వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆవుల బసవయ్య, తోట చంద్రశేఖర్, తోట సత్యనారాయణ, కఠారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.